# 'అర్థం చాటున కళ'

ఓ పదిహేను రోజుల క్రితం ఓ ముప్పై ముప్పై అయిదేళ్ల వ్యక్తి ఇంటికొచ్చాడు. ఇల్లు కొత్తది. ఇంకా సామాన్లు సర్దుకోడంలోనే వున్నాం మేము.

ఆ వ్యక్తి మాసిపోయి చిరుగులు పడిపోయిన ప్యాంటు, షర్టు వేసుకున్నాడు. తలకు తైల సంస్కారం లేదు. మట్టి పేరుకున్న గోళ్ళకు చేతివేళ్లకు పెయింట్ మరకలున్నై... "ఎవరూ బాబూ నువ్వు?" అని అడిగా.

"కొత్త ఇల్లు కద సార్ గడపలకు డిజైన్ వేస్తాను. బాగా వేస్తాను సార్" అన్నాడు. పక్కనే వున్న మా జయక్క 'నువ్వు డిజైన్లు వేసినట్టే వుందిగానీ' అన్నట్టు చూసి "వద్దులే నాయినా మేం గడపలకు పసుపు రాసుకుని కుంకుమబొట్టు పెట్టుకుంటాం" అంది. అతను చిన్నబుచ్చుకోలేదు. నిరాశ చెందలేదు.

"కాదమ్మా చూడండి నిజంగా బాగా వేస్తాను. ముందు ఒక్క గడపకు వేయనివ్వండి" అన్నాడు ఓ ఇరవై నిముషాలు...

"వద్దు'... 'చూడండి'... 'వద్దు'... 'చూడండమ్మా' అని గడిచింది.

ఆఖరికి మా జయక్క దిగొచ్చింది.

"గడపకెంత తీసుకుంటావ్?" అనడిగింది.

"గడపకు యాభై యిప్పించండమ్మా"

"అం పసుప్పెయింటు రాసి ఎర్రబొట్టు పెట్టేందుకు యాభై రూపాయలా!" అని మళ్లీ ఓ పదిహేన్నిముషాలు వాగ్వాదం.

చివరికతనికి అవకాశం యిచ్చేసింది మా జయక్క.

ఆ తర్వాత ఆ వ్యక్తి ఓ రెండు గంటలకు "ఇక వెళ్తానమ్మా చూడండి" అని తను లతలూ పూలూ చిత్రించిన గడపల్ని చూపించాడు.

జయక్క మారు మాట్లాడకుండా ఆ వ్యక్తి అడిగిన దానికంటే ఎక్కువిచ్చి భోజనం పెట్టి దీవించి పంపించింది.

ఆ గడపల్ను తను ఎంత అందంగా చిత్రాల్తో దిద్దాడో...!

No artist has art written on his face...

ఏ కళాకారుడి నుదుట కళ రాసి వుండదుకదా...

అంత దారిద్ర్యంలోనూ అతను కళనే నమ్ముకున్నాడు.

* * *

సరే మొన్న హైదరాబాద్ వచ్చాను. మిత్రులు రోహిణీకుమార్‌గారి ఆఫీసులో కూచుని మాట్లాడుకుంటున్నాం. (ఈయన గురించి బతుకుబడిలో రాసాను. కుంచెకు విశ్రాంతినిచ్చి రంగుల్ని అటకెక్కించిన గొప్ప చిత్రకారుడు)

నా రాబోతున్న పుస్తకం డి.టి.పి. ప్రూఫులు చూస్తున్నాం. ఇంతలో ఓ యువకుడు లోపలికొచ్చాడు.

'మా డిజైనర్' అని పరిచయం చేసారు రోహిణీకుమార్.

ఓహో... అనుకున్నా. కమర్షియల్ డిజైనింగ్ మీద పెద్ద గౌరవం లేని నేను (అది నా అజ్ఞానానికి సంకేతమేననుకోండి... కానీ సహజగుణం కదండీ)

'పేరు భాస్కర్' అని నన్ను పరిచయం చేయకుండా వీరే కాశీభట్ల అన్నట్టు ప్రూఫులు చూపారు రోహిణీకుమార్‌గారు.

అప్పటికీ ఆ సదరు భాస్కర్ పట్ల నేనాసక్తి చూపలేదు.

"ఇతను ఫైనార్ట్స్ డిగ్రీ చేసాడు" మళ్లీ అన్నారు రోహిణీకుమార్... అప్పుడు అతని పట్ల శ్రద్ధ కలిగింది నాకు.

ఆప్యాయంగా పేరు అడిగా. కేతవరపు బాబూభాస్కర్ అని తన గురువుగారు వాళ్ల డ్రాయింగ్ మాస్టర్ నారాయణరావుగారనీ చెప్పాడు. అతనికి ఓ తెల్లకాగితమిచ్చి మీ గురువుగారి గురించి ఓ వాక్యం రాయి అంటే అతను రాసింది 'చాలా గొప్ప ఆర్టిస్ట్' అని.

* * *

***కళలకు, కళాకారులకు... కళను ప్రేమతో పంచే కళాగురువులకు నమస్సులు.*** ●